క్లుప్తంగా

మంచినీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంచినీటి ఎద్దడి దృష్ట్యా కార్యదర్శులు అప్రమతంగా ఉండాలని ఈవోఆర్డీ శ్రీనివాసరావు సూచించారు. ఆయన శనివారం కార్యదర్శులతో మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదికలు కార్యాలయంలో అందజేయాలని, గ్రామాల్లో ఉన్న బోర్లు, ఇతర నీటి వసతులపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లోని సమాచారం ఎప్పటికప్పుడు అందజేస్తే జిల్లా అధికారులకు నివేదిస్తామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్షన్ వెరిఫికేషన్‌కు సహకరించండి

ముండ్లమూరు (కురిచేడు): మండలంలో వికలాంగుల పెన్షన్ వెరిఫికేషన్ జరుగుతోందని, అందుకు పెన్షన్‌దారులందరూ సహకరించాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మొత్తం 108 మంది ఉన్నారని, వారిలో ఈ నెల 20వ తేదీ 38 మంది, 25వ తేదీన 40 మంది, 27వ తేదీన 30 మందికి, వినికిడి లోపం ఉన్న వారు మొత్తం 115 మంది ఉన్నారని, వారిలో 25వ తేదీన 37 మంది, 27వ తేదీన 40 మంది, 28వ తేదీన 38 మంది, మానసిక వికలాంగులు మొత్తం 68 మంది ఉన్నారని, వారిలో 27వ తేదీన 28 మంది, 28వ తేదీ 40 మంది పెన్షన్ల వెరిఫికేషను చేస్తారని ఆయన తెలిపారు. ఒంగోలు రిమ్స్‌లో తేదీల వారీగా రీ వెరిఫికేషన్ జరుగుతుందని, పెన్షన్‌దారులందరూ ఆయా తేదీల్లో వారికి కేటాయించిన తేదీల్లో తప్పనిసరిగా ఒంగోలు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

చెత్తను తొలగించిన అధికారులు



ప్రజలకు డస్టుబిన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: మండలంలోని నాగబొట్లపాలెం, తూర్పు గంగవరం ప్రధాన రహదారి మార్గాన వాయుల వాగు బ్రిడ్జి వద్ద చెత్తా చెదారం నిల్వ ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఈ నెల 8న సాక్షి దినపత్రికలో 'డంపింగ్ యార్డును తలపిస్తున్న వాగు' అనే శీర్షికతో కథనం ప్రచురించడం జరిగింది. స్పందించిన పంచాయతీ అధికారులు శనివారం అక్కడున్న చెత్తను జేసీబీ సాయంతో తొలగించారు. చెత్తను వేసుకునేందుకు ఇంటింటికీ డస్ట్ బిన్ పంపిణీ చేశారు. ఎంపీడీవో దారా హనుమంతరావు, ఏఓ సత్యం, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి, సర్పంచ్ చిమట సుబ్బారావు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో మేట్‌లకు పెద్దపీట

- ప్రతి 50 మంది వేతనదారులకు ఒక మేట్
- ఒక్కో వేతనదారుకు రూ.1.50 చొప్పున మేట్‌కు చెల్లింపు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పెద్దారవీడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మేట్‌లు కీలకంగా మారనున్నారు. అందులో పని చేస్తున్న వేతనదారులను కూటమి వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఎత్తుగడ వేస్తోంది. వేతనదారులను మోటివేట్ చేసి ఓటు బ్యాంకును పెంచుకునేందుకు నాయకులకు అనుకూలంగా ఉన్న వారిని మేట్లుగా నియమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట మేట్‌లకు బాధ్యతలు అప్పగించారు. అలా కాకుండా ప్రతి శ్రమశక్తి సంఘానికి ఒక మేట్‌ను నియమించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి 50 మంది వేతనదారులకు ఒక శ్రమశక్తి సంఘంగా ఏర్పడితే ఆ సంఘానికి మేట్ బాధ్యత వహిస్తారు. ఇలా ఉన్న మేట్‌కు ఆ రోజు పనికి వచ్చిన వేతనదారుల ఆధారంగా ఒక్కో వేతనదారునికి రూ.1.50 చొప్పున అదనపు వేతనాన్ని మేట్‌కు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. 50 మంది వేతనదారులకు సంబంధించి రోజుకు రూ.75 చెల్లిస్తుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని సమయంలో సీనియర్ మేట్లు, పని నిబద్ధత కలిగిన మేట్‌లకు పనుల బాధ్యతలు అప్పగిస్తారు. ఇదే అదనుగా టీడీపీ నాయకులు తమ అనుచరులను నియమించుకునేందుకు చర్యలు మొదలు పెట్టారు.

బలోపేతం దిశగా శ్రమశక్తి సంఘాలు

ఇప్పుడు 50 మంది వేతనదారులను శ్రమశక్తి సంఘంగా ఏర్పరుస్తున్నారు. ఈ సంఘాల ద్వారా వేతనదారులకు సకాలంలో పని కల్పించేలా కనీస వేతనం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంఘాలకు చెందిన వేతనదారుడే మేట్‌గా వ్యవహరిస్తారు. రోజూ ప్రతి వేతనదారునికి కనీసం రూ.300 వేతనం గిట్టుబాటయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 100 రోజుల గ్యారంటీ పనిని పూర్తి చేయిస్తే ఆయా వేతనదారుని ద్వారా రూ.3లు అదనంగా ఆ సంఘం మేట్‌కు అందనుంది. ఇలా శ్రమశక్తి సంఘాలను బలోపేతం చేస్తున్నారు. మండలంలో 19 పంచాయతీల్లో జాబ్ కార్డులు 12470 మంది, వేతనదారులు 30 వేల మంది, శ్రమశక్తి సంఘాలు 675 గానూ 650 మంది మేట్లు అవసరం ఉందని అధికారులు గుర్తించారు.

మేట్‌లకు అదనపు వేతనం



కొత్తగా మేట్ల నియామకానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రతి 50 మందికి వేతనదారుల పని తీరును పర్యవేక్షించేందుకు ఒక మేట్‌ను నియమించనున్నాం. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో శ్రమశక్తి సంఘాలకు మేట్‌ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి గ్రామంలో శ్రమశక్తి సంఘాలు, మేట్‌ల ఎంపిక తప్పనిసరిగా జరుగుతుంది. మేట్‌లకు బాధ్యతలు అప్పగించడం ద్వారా అదనపు వేతనం కూడా లభిస్తుంది.

– ఎన్.మంత్రూనాయక్, ఇన్‌చార్జి ఏపీఓ, పెద్దారవీడు

అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన అధికారులకు బదిలీతో సరి



అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవినాగ్ (ఫైల్)

- సెలవుపై వెళ్లిన తహసీల్దార్

యర్రగొండపాలెం: అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన అధికారులను బదిలీతో సరిపెట్టుకున్నారు. తహసీల్దార్ బాల కిషోర్‌కు మాత్రం దీర్ఘకాలికి సెలవు మంజూరు చేశారు. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్లు 58, 58/1లో ఉన్న స్థలాలను మండలంలోని సర్వాయపాలేనికి చెందిన దొడ్డపనేని శ్రీనివాసరావు అక్రమంగా గిఫ్ట్ డీడ్ చేయించుకొని గత నెల 16వ తేదీన తన భార్య యోగమ్మ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ రెండు సర్వే నంబర్లలో ఉన్న స్థలంతో పాటు రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్డు స్థలాన్ని కూడా గత నెల 22వ తేదీన తన భార్య పేరుతో మరో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం పాఠకులకు విదితమే. ఈ స్థలాలు రిజిస్ట్రేషన్‌పై ఈ నెల 3వ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ శ్రీవినాగ్ విచారించి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నివేదించారు. ఈ విచారణలో వీఆర్వో-2 ఎల్లయ్య, సర్వేయర్లు దిలీప్, వెంకటరెడ్డి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేసి రిజిస్ట్రేషన్‌కు సహకరించినట్లు రుజువు కావడంతో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్లయ్యను పాలుట్ల, దిలీప్‌ను కాశికుంట తండా, వెంకటేశ్వరరెడ్డిని అమానిగుడిపాటులకు బదిలీ చేశామని, తహసీల్దార్‌పై విచారణ కొనసాగుతోందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.మల్లికార్జున నాయుడు తెలిపారు. రూ.కోట్లు విలువ చేసే స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యేందుకు కారకులపై కేవలం బదిలీ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని, ఆ స్థలంలో ఉన్న రేకుల షెడ్డుకు పన్ను చెల్లిస్తున్నట్లు రశీదు అందజేసిన పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డిపై ఎటువంటి విచారణ చేపట్టక పోవడంపై జిల్లా స్థాయి అధికారులపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నూతన ప్రతిష్టకు భక్తులు తరలిరావాలి

కురిచేడు: స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలోని ఆదివారం ఉదయం గురు దక్షిణామూర్తి, కాలభైరవస్వామి వార్ల ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు తెలిపారు. ఆలయంలో ఉత్తరం వైపు ఉత్తర చండీశ్వరుడు, గురు దక్షిణామూర్తి ఆలయంలో దక్షిణం వైపు ఉన్న కాలభైరవస్వామి ప్రతిష్ట కార్యక్రమాలు ఉదయం 8.30 గంటలకు జరుగుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

50 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని కోటతిప్పలో శనివారం 104 వాహనం ద్వారా 50 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ముందుగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో బీపీ, సుగర్, జ్వరం, జలుబు, దగ్గు వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేశారు. డాక్టర్ సందీప్ కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణతో మెరుగైన ఫలితాలు

సీఎస్‌పురం(పామూరు): క్లస్టర్ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలతో మెరుగైన ఫలితాలు సాధ్యమని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం, శీలంవారిపల్లె, అంబవరం, సి.నాగులవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల్లో శనివారం క్లస్టర్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా బోధనా సామర్థ్యం పెంపుపై ఆర్పీలు శిక్షణనిచ్చారు.

శనగలో సస్యరక్షణ చర్యలు పాటించండి

జరుగుమల్లి(సింగరాయకొండ): శనగ పంటలో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ పి.యుగంధర్‌రెడ్డి అన్నారు. జరుగుమల్లి మండలంలోని చిర్రికూరపాడులో శనివారం పొలంబడి నిర్వహించారు. ఏఓ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ శనగ విత్తనాలు నాటేటప్పుడు విత్తనశుద్ధి చేసుకుని నాటుకోవాలని, అవసరమైన మేరకు పురుగుమందుల వాడకం ఉండాలని, పంటలో మిత్ర పురుగుల ప్రాధాన్యాన్ని రైతులకు వివరించారు. ఏఏఓ శ్రీలేఖ, గ్రామ వ్యవసాయాధికారి హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందజేత

పీసీపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ లో దివ్యాంగ పిల్లలకు ఉపకార వేతనాలను శనివారం ఎంఈఓ లు సంజీవ్, శ్రీనివాస చారి చేతుల మీదుగా అందజేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు వారి ఆర్థిక అభివృద్ధికి మెరుగుపడేందుకు ప్రభుత్వం ఈ ప్రోత్సాహకం అందజేస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఐఆర్‌టీ నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

పొన్నలూరు: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్సై అనూక్ హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, నేరాలను అరికట్టేందుకు అనుమానితులపై నిఘా ఉంచుతున్నామన్నారు. అలాగే కార్లు, బైక్‌లు ఇతర వాహనాల్లో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం తరలించకుండా ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రజల్లో శాంతి భద్రతలపై నమ్మకం కలిగిలా రాత్రిళ్లు సమయంలో గస్తీ తిరుగుతున్నారన్నారు. చట్ట వ్యతిరేక పనులకు ఎవరు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



పొన్నలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై అనూక్

ఘనంగా జెండాల ఉత్సవం



మద్దలకట్టలో ఊరేగిస్తున్న జెండాలు

పెద్దారవీడు: మండలంలోని మద్దకట్టలో శ్రీ నాగులమీరాస్వామి ఉరుసు సందర్భంగా శనివారం జెండాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. జెండాలను వీధుల్లో తప్పెట్లు, మేళాలలో జెండాలను ఊరేగించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు జెండాలకు డబ్బులు, మహిళలు బొరుగులు, టెంకాయలు, బత్తీలు సమర్పించారు. శుక్రవారం రాత్రి నాగులమీరాస్వామి దర్గాలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేసి కాయకర్పూరం సమర్పించారు. నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించారు. చాట్లమడలో వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూ పెద్దచన్నయ్య కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు గుంటూ గాలెమ్మ, అంగిరేకుల ఆదినారాయణ యాదవ్, మాజీ ఎంపీపీ జెడ్డా చిన్న రాజయ్య, నాయకులు మూల సత్యంరెడ్డి, ఏర్వ శ్రీనివాసరెడ్డి, ఏర్వ బోడిరెడ్డి, దర్శనం యోబు, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తోకల ఆవులయ్య, కోనంగి నాగరాజు, దుద్దెల కోటిరెడ్డి, జడ్డా మరియదాసు ఉన్నారు.

తిరుమలనాథ స్వామికి పూజలు



తిరుమలనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం



హెచ్‌ఎంకు విరాళం అందిస్తున్న గ్రామస్తులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు 30 వేల రూపాయల అర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం చిన్నదోర్నాలలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మారం కాశిరెడ్డి రూ.10 వేలు, జడ్డు వెంకటేశ్వరరెడ్డి రూ.5 వేలు, గుండారెడ్డి వెంగళరెడ్డి రూ.5 వేలు, చింతల సచివాలయ ఉద్యోగి పసుపులేటి సుదర్శన్ రూ.5 వేలు, అడుసుమిల్లి వెంకట నారాయణ రూ.5 వేలు చొప్పున మొత్తం 30 వేల రూపాయలను ప్రధానోపాధ్యాయుడు మండ్లా శ్రీనివాసులుకు అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుబ్బారావు, పాలకిటి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



పైప్‌లైన్ వేసేందుకు కాలువ తీస్తున్న జేసీబీ

యర్రగొండపాలెం: తాగునీటి కోసం మహిళలు చేసిన ఆందోళనకు అధికారులు దిగిరాక తప్పలేదు. పది రోజుల కాలంగా తమ కాలనీల్లో నీటి సరఫరా లేక పోవడంతో అల్లాడి పోతున్నామని ఎన్టీఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బలపాల ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన మహిళలు రెండు పర్యాయాలు ఆందోళనకు దిగారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలపై ఖాళీ బిందెలు చేతపట్టుకొని దండయాత్ర చేశారు. నీటి ట్యాంకర్లు పంపిస్తామని అధికారులు చెప్పినా వారు వినలేదు. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. వెంటనే నీటి సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన అధికారులు తక్షణమే రూ.3 లక్షలు ఖర్చుపెట్టి ఆయా ప్రాంతాలకు పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆయా కాలనీ వాసుల నీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

ఇంకుడు గుంతలపై అవగాహన



ఇంకుడు గుంతను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జాన్‌సుందరం

పెద్దారవీడు: నీటి సంరక్షణే లక్ష్యంగా ఇంకుడు గుంతలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జాన్‌సుందరం అన్నారు. మండలంలో ఎస్.కొత్తపల్లిలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఇంకుడు గుంతను ఎంపీడీఓ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 543 ఇంకుడు గుంతలు మంజూరు చేశామన్నారు. ప్రతి పంచాయతీలో 10 నుంచి 15 వరకు ఇంకుడు గుంతలు నిర్మించేందుకు లబ్ధిదారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఉపాధి హామీ ఏపీడీ నిర్మలాదేవి, ఏపీఓ మంత్రూనాయక్, ఈఓఆర్డీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలకు శ్రీకారం చుట్టి ఉద్యోగావకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్

పామూరు: దొనకొండలో పారిశ్రామిక కారిడార్, కనిగిరి నియోజకవర్గంలో నిమ్జ్ ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, సీఎంగా చంద్రబాబు మొదటి సంతకం చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఇప్పటికైనా విడుదల చేసి ఖాళీగా పోస్టులను భర్తీచేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. నాయకులు ప్రసాద్, మహేష్, పలువురు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ



దర్శి: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ముండ్లమూరు (కురిచేడు): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ ఆర్.జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం ప్రతిజ్ఞ చేశారు. తొలుత శ్రమదానం చేసి కార్యాలయం ఆవరణ పరిసరాలు శుభ్రం చేశారు. ఎంఈఓ, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి కె.నాగరాజు, ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ జి.శివరామకృష్ణ, సాంకేతిక సహాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: స్వచ్ఛతతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించడంతో స్థానిక జెడ్పీ పాఠశాలలో శనివారం మొక్కలు నాటి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రామాలను, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రతి ఒక్కరూ కృత నిశ్చయంతో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కురిచేడు రోడ్డులోని ఎన్టీఆర్ పార్కులో ముందుగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పార్కు ప్రాంతాన్ని శుభ్రం చేశారు. సీఐ రామారావు, ఎస్సై మురళి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

దొనకొండ: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సిబ్బంది వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్, సున్నం చల్లించారు. గ్రామ ప్రజలు, అధికారులు, పంచాయతీ సిబ్బంది స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేశారు. స్థానిక పౌర సరఫరాల గోడౌన్‌లో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.శ్రీదేవి, అడ్మినిస్ట్రేషన్ అధికారి దావూద్, స్వచ్ భారత్ మండల కో ఆర్డినేటర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. కార్యాలయం పరిసరాలను శుభ్రం చేసి వ్యర్థాలను కాల్చేశారు. పాత ఫైళ్లను, టాయిలెట్లను శుభ్రం చేశామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.



దొనకొండలో వీధులు శుభ్రం చేస్తున్న కార్మికులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

టంగుటూరు: మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 5,7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కన్వీనర్ స్రవంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొండపి టంగుటూరు(బాలురు), టంగుటూరు (బాలికలు), మార్కాపురం(బాలికలు), కనిగిరి(బాలికలు), యర్రగొండపాలెం (బాలురు) లో ఉన్న గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో పూర్తి సీట్లు, 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ చేసేందుకు పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2025–2026 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు కొండపి టంగుటూరు బాలురు ఫోన్ నెంబర్ 9676246120, టంగుటూరు బాలికలు ఫోన్ నంబర్ 9703175895, మార్కాపురం బాలికల ఫోన్ నంబర్ 7702411446, యర్రగొండపాలెం బాలురు ఫోన్ నంబర్ 7286969849, కనిగిరి బాలికలు బాలికలు 9985013205 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

పొన్నలూరు: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను, కేసుల డైరీలను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పెండింగ్ కేసులను సాధ్యమైనంత త్వరగా విచారణ చేయాలన్నారు. అలాగే లోక్ అదాలత్‌లో అనుకూలంగా ఉన్న అన్ని రకాల కేసులు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసులు మర్యాదగా ప్రవర్తించి నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా పేకాట, గంజాయి, గుట్కా, అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా సారించి చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రిళ్లు పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. అనంతరం పలు కేసులకు సంబంధించిన వివరాలను ఎస్సై అనూక్ సీఐకు వివరించారు.